క్లుప్తంగా

బీజేపీ జిల్లా కార్యదర్శిగా శ్రీనివాస్


కొల్లా శ్రీనివాస్

ఏలేశ్వరం: బీజేపీ జిల్లా కార్యదర్శిగా మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన కొల్లా శ్రీనివాస్ రెండోసారి నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర నాయకత్వం నుంచి ఉత్తర్వులు అందినట్టు గురువారం శ్రీనివాస్ తెలిపారు. ఆయన గత 30 ఏళ్లుగా పార్టీలో వివిధ పదవుల్లో పనిచేశారు. పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. తనను జిల్లా కార్యదర్శిగా నియమించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్‌కు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనివాస్‌కు పలువురు బీజేపీ నాయకులు అభినందనలు తెలిపారు.

హెల్త్ కార్డుల పంపిణీ


తుని అమ్మాజీపేట సచివాలయంలో హెల్త్ కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు

తుని: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన ఆయుష్మాన్ భారత్ పథకం ప్రజల ఆరోగ్య భద్రతకు దోహదం చేస్తోందని వైఎస్సార్ సీపీ తుని పట్టణ శాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్ అన్నారు. తుని అమ్మాజీపేట సచివాలయంలో గురువారం ప్రజలకు హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు ఆరోగ్య పరంగా ప్రభుత్వాలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కౌన్సిలర్ వాసంశెట్టి శ్రీను, మాజీ కౌన్సిలర్లు మంతిన గోవిందరాజులు, పిల్యాణం నూకరాజు, నాయకులు మర్రా దాసు, మొల్లేటి గణేష్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

గోకవరం: రాష్ట్రస్థాయి డ్రాయింగ్ పోటీల్లో మండలంలోని గుమ్మళ్లదొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని దాడి దుర్గాదేవి ఉత్తమ ప్రతిభ కనబరిచినట్టు పాఠశాల హెచ్‌ఎం కె.లక్ష్మీకాంతం తెలిపారు. ఈ నెల 8న అమలాపురం, అనపర్తిలో జరిగిన ఎస్జీఎఫ్ డ్రాయింగ్ పోటీలో దుర్గాదేవి ప్రతిభ చూపి నాల్గో స్థానంలో నిలిచిందన్నారు. అలాగే అండర్–17 విభాగంలో వేమగిరి విజయ్‌కుమార్ త్రో బాల్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్టు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను గురువారం పాఠశాలలో హెచ్‌ఎంతో పాటు పీఎంసీ చైర్మన్ పి.చిన్ని, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

కేంద్ర తీరుకు వ్యతిరేకంగా ఆందోళన


తునిలో నిరసన తెలుపుతున్న లిబరేషన్ శ్రేణులు

తుని: పౌరుల ప్రాథమిక హక్కులను హరించే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.జనార్దన్ అన్నారు. కేంద్ర తీరుకు వ్యతిరేకంగా గురువారం తుని గొల్ల అప్పారావు సెంటర్లో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ పత్రికలు, మీడియా, జర్నలిస్టులపై దాడులు, అరెస్టులు జరుపుతున్న తీరును చూస్తే రాజ్యాంగ హక్కులను కాలరాసే విధంగా మోదీ ఫాసిస్టు పాలన ఉందన్నారు. బీజేపీ పాలనలో శాంతి భద్రతలకు భంగం కలుగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయడానికి ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వాడబోయిన శివ, యర్రంశెట్టి అప్పారావు, తాతారావు, సింహాచలం పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించిన ద్వారకా తిరుమల దేవస్థానం ఈఓ

అన్నవరం: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల దేవస్థానం ఈఓ వి.త్రినాథరావు గురువారం సతీసమేతంగా రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. దేవస్థానంలో పండితులు వారికి ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందచేసి స్వామివారి ప్రసాదాలు బహూకరించారు. అనంతరం ద్వారకా తిరుమల దేవస్థానం ఈఓ త్రినాథరావు అన్నవరం దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

ఈఓ అజాద్‌కు అభినందనలు

అన్నవరం దేవస్థానం రెగ్యులర్ ఈఓగా నియమితులైన చంద్రశేఖర్ అజాద్‌ను పలువురు అభినందించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు పేరూరి బద్రి నారాయణ, రిసెప్షన్ సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, పూజాద్రవ్యాల షాపు పాటదారుడు వీర్ల చక్రరావు తదితరులు ఆయనను శాలువా, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

రోప్ పట్టు... పతకం కొట్టు..


నాసిక్‌లోని జాతీయ క్రీడామైదానంలో ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థినులు


జాతీయస్థాయి పోటీల్లో సాధించిన మెడల్స్‌తో విద్యార్థినులు

- రోప్ స్కిప్పింగ్ పోటీల్లో రాణిస్తున్న విద్యార్థినులు
- రాష్ట్రీయ, జాతీయ స్థాయిలో ప్రతిభ
- ఇంటర్నేషనల్స్‌కు అర్హత సాధించిన ఇద్దరు విద్యార్థినులు

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు రోప్ స్కిప్పింగ్ పోటీల్లో సత్తాచాటుతున్నారు. ప్రోత్సహిస్తే జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో సైతం ప్రతిభ చూపి పతకాలు సాధిస్తామని నిరూపిస్తున్నారు. గత నెలలో భీమవరంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలు, అదే నెల 29న మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగిన జాతీయ స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో అండర్ 14, 17 విభాగాల్లో తొమ్మిదో తరగతి విద్యార్థినులు బి.గీతిక, కె.స్నేహ, పి.పావని, వై.జ్యోతి, ఎ.అనిల పాల్గొని ప్రతిభ చూపారు. 12 బంగారు, వెండి, కాంస్య పతకాలను సొంత చేసుకున్నారు.

అంతర్జాతీయ పోటీలకు...

జాతీయ స్థాయిలో పథకాలు సాధించడమే కాకుండా అంతర్జాతీయ రోప్ స్కిప్పింగ్ చాంపియన్ షిప్ పోటీలకు గీతిక, జ్యోతి అర్హత సాధించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మల కుమారి, పీడీ జయలక్ష్మి, పీఈటీ సాధన విద్యార్థినులను అభినందించి సంతోషం వ్యక్తం చేశారు. అవకాశం వస్తే అంతర్జాతీయ రోప్ స్కిప్పింగ్ పోటీల్లో పాల్గొని దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకువస్తామని విద్యార్థినులు పేర్కొన్నారు. జాతీయస్థాయిలో రాణించిన విద్యార్థినులకు ఉన్నత విద్య, ఉద్యోగావకాశాల్లో ప్రాధాన్యం లభిస్తుందని ప్రిన్సిపాల్ నిర్మల కుమారి తెలిపారు.

ప్రోత్సహిస్తే మరిన్ని విజయాలు



పాఠశాల్లో పీడీ, పీఈటీల శిక్షణతోనే మెరుగైన ఫలితాలు సాధించాం. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా నిపుణులు శిక్షణ ఇవ్వాలి. అప్పుడే విద్యతో పాటు క్రీడల్లోనూ మరింతగా రాణించగలం. ఇందుకు అవసరమైన మౌలిక వసతులను కల్పించాలి. క్రీడాకారులను అన్నివిధాలా ప్రభుత్వం, దాతలు ప్రోత్సహించాలి.

– ఎ.అనిల, విద్యార్థిని, అండర్ –14 విభాగం

సంతోషంగా ఉంది



భవిష్యత్‌లో జరగనున్న అంతర్జాతీయ రోప్ స్కిప్పింగ్ పోటీలకు అర్హత సాధించడం సంతోషంగా ఉంది. మహారాష్ట్రలోని నాసిక్‌లో గత నెలలో జరిగిన జాతీయ రోప్ స్కిప్పింగ్ పోటీల్లో డబుల్ టచ్‌లో బంగారు, ఫోర్ ఎక్స్ అండర్‌లో బంగారు, ఆల్టర్నేట్ విభాగంలో వెండ పతకాలు సాధించాను. బహుళ విభాగాల్లో కనబర్చిన ప్రతిభతోనే అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించాను.

– బి.గీతిక, విద్యార్థిని, అండర్ –17 విభాగం

అనుభవంతో రాణిస్తాను



గత నెల 29 నుంచి ఈ నెల 2వ తేదీ వరకూ నాసిక్‌లో జరిగిన జాతీయ స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో ఆడడంతో ఎంతో అనుభవం లభించింది. ఈ అనుభవంతో భవిష్యత్‌లో జరిగే పోటీల్లో మరింతగా రాణిస్తాను. జాతీయ స్థాయి పోటీల్లో డబుల్ టచ్ విభాగంలో బంగారు, 30 స్పీడ్ ర్యాలీలో వెండి పతకాలు సాధించాను.

– కె.స్నేహ, విద్యార్థిని, అండర్ –17 విభాగం

మంచి ఉద్యోగం సాధిస్తాను



జాతీయస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో ప్రతిభ, నైపుణ్యాన్ని ప్రదర్శించాను. డబుల్ టచ్‌లో బంగారు, స్పీడ్ ర్యాలీలో వెండి పతకాలు లభించాయి. మరింతగా శ్రమించి భవిష్యత్‌లో బంగారు పతకాలు గెలుస్తాను. స్పోర్ట్స్ కోటాలో మంచి ఉద్యోగాన్ని సాధించి, కుటుంబానికి అండగా నిలుస్తాను.

– పి.పావని, విద్యార్థిని, అండర్ –17 విభాగం

బహుముఖ ప్రతిభతో...



నాసిక్‌లో జరిగిన 24వ జాతీయస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలు అండర్–14 విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచాను. 4 ఎక్స్ డబుల్ టచ్‌లో బంగారు, ఆల్టర్నేట్ విభాగంలో వెండి, డబుల్ టచ్‌లో కాంస్య పతకాలు సాధించాను. బహుముఖ ప్రతిభతో అంతర్జాతీయ పోటీలకు అర్హత లభించింది. భవిష్యత్‌లో జరిగే అంతర్జాతీయ పోటీల్లో రాణించి పతకాలు సాధిస్తాను.

– వై.జ్యోతి, విద్యార్థిని, అండర్ –14 విభాగం

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ శ్రీలత

కోటనందూరు: ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత సూచించారు. ప్రపంచ బాలికల దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని అల్లిపూడి కేజీబీవీ పాఠశాలను ఆమె సందర్శించారు. పాఠశాల పరిసరాలు, వసతి, బాలికలకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బాలికల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్ఓ రాజేశ్వరికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ శ్రీలత మాట్లాడుతూ బాలికల విద్య, రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకొని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని విద్యార్థినులకు సూచించారు. కేజీబీవీ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు


దాడుల్లో స్వాధీనం చేసుకున్న సారా తయారీ సామగ్రితో ఎస్ఈబీ సిబ్బంది

ప్రత్తిపాడు: మండలంలోని పెద్దిపాలెంలో సారా స్థావరాలపై గురువారం ప్రత్తిపాడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడిలో సారా తయారీకి సిద్ధం చేసిన 200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఐదు లీటర్ల సారాతో బొండల వీరకుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడిలో ఎస్ఈబీ ఎస్సై బి.శ్రీనివాసరావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తివిద్యా కోర్సులతో ఉజ్వల భవిత


జగ్గంపేటలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఒమ్మి రఘురాం

జగ్గంపేట: వృత్తి విద్యాకోర్సులు నేర్చుకోవడం ద్వారా స్వయం ఉపాధికి అవకాశాలు మెండుగా ఉంటాయని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జగ్గంపేట ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులకు 2021–23 విద్యా సంవత్సరం కోర్సు పూర్తయిన సందర్భంగా సర్టిఫికెట్ల ప్రదానోత్సవం జరిగింది. ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ కృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఒమ్మి రఘురాం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తి నైపుణ్యాన్ని ఎప్పటికప్పుడు మెరుగపరుచుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. యువత వృత్తి విద్యాకోర్సులు పూర్తి చేస్తే స్వయం ఉపాధి పొందే అవకాశాలు ఎక్కువుగా ఉన్నాయన్నారు. ఉద్యోగాల కోసం ప్రయత్నం చేస్తూనే స్వయం ఉపాధిని మెరుగు పరుచుకోవాలని విద్యార్థులకు సూచించారు. జగ్గంపేటలో ఐటీఐకు ప్రభుత్వం స్థలం కేటాయించిందని చెప్పారు. అనంతరం వృత్తి విద్యా కోర్సు పూర్తి చేసిన 43 మంది విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు కిలపర్తి వీరబాబు, నీలపల్లి అప్పారావు, దత్తి శ్రీనివాస్ వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

దేవస్థానం భూముల్లో మొక్కల పెంపకం


రత్నగిరిపై మొక్కలు నాటుతున్న ఈఓ చంద్రశేఖర్ అజాద్

అన్నవరం: రత్నగిరిపై కొలువైన సత్యదేవుని ఆలయం, ఇతర ఉపాలయాలు, స్వామివారి వ్రతాలు, ఇతర పూజా కార్యక్రమాల్లో ఉపయోగించే మారేడు తదితర వృక్షాలను రత్నగిరి దేవస్థానం భూముల్లో విరివిగా పెంచాలని నిర్ణయించినట్టు ఆలయ ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. తన బాల్యమిత్రులు, విజయవాడ పడమట స్కూల్ చెందిన 1985 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు విరాళంగా సమర్పించిన రూ.2 లక్షలతో కొనుగోలు చేసిన మొక్కలను గురువారం సత్యగిరిపై పలు ప్రాంతాల్లో నాటారు. ఉదయం 9 గంటలకు శివసదన్ సత్రం వద్ద పండితులు, ఈఓ సత్యదేవునికి పూజలు చేసి మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. మారేడు, మామిడి, జమ్మి, సంపంగి తదితర మొక్కలను నాటారు. అనంతరం విష్ణుసదన్ సత్రం నుంచి రెండో ఘాట్‌రోడ్డు మూడో మలుపు వరకు నిర్మిస్తున్న రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్ బాబు, అర్చకులు కోట సుబ్రహ్మణ్యం, వైదిక కార్యక్రమాల సలహాదారు నాగాభట్ల కామేశ్వరశర్మ, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, ట్రస్ట్‌బోర్డు సభ్యుడు పేరూరి బద్రీ నారాయణ పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు ఘన స్వాగతం







సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం సామర్లకోట వచ్చారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల ఎమ్మెల్యేలు పర్వత పూర్ణచంద్రప్రసాద్, జ్యోతుల చంటిబాబు పుష్పగుచ్ఛాలతో సీఎం జగన్‌కు ఘన స్వాగతం పలికారు.

సీఎం సభకు భారీగా తరలివెళ్లిన నాయకులు


ప్రత్తిపాడులో ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

ప్రత్తిపాడు: సామర్లకోటలో గురువారం జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సభకు ప్రత్తిపాడు మండలం నుంచి భారీఎత్తున వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివెళ్లారు. మండలంలోని పెదశంకర్లపూడి, లంపకలోవ, పెద్దిపాలెం, టి.రాయవరం, ఏలూరు, ఉత్తరకంచి తదితర గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు వివిధ వాహనాల్లో మండల కేంద్రమైన ప్రత్తిపాడుకు చేరుకున్నారు. స్థానిక సర్యాస్ ఫంక్షన్ హాలు వద్ద ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రెడ్నం వెంకటేశ్వరరావు, మండల జేఏసీ కన్వీనర్ రామిశెట్టి చినబాబు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల వీరబాబు, గుడాల వెంకటరమణ, చెలంకూరి రాజబాబు, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- పలు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష


గోకవరంలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గోకవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. వైద్య శిబిరంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వైద్య సేవలందించి ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన స్టాల్‌ని పరిశీలించి గర్భిణులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమాల్లో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, పార్టీ నాయకుడు సుంకర వీరబాబు, సర్పంచ్ కొమరం శ్రావణి, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, వైస్ ఎంపీపీ మడికి మైనర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం

తుని రూరల్: పేదల పరిపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని జేసీఎస్ కన్వీనర్ సకురు నాగేంద్ర నెహ్రూ అన్నారు. ఎస్.అన్నవరం సచివాలయం–2లో గురువారం వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర నెహ్రూ ప్రారంభించారు. రోగులకు ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేశారు. ఎస్.సూరవరం పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో రోగులకు వైద్య పరీక్షలు చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు, మండల యూత్ కన్వీనర్ చోడిశెట్టి వెంకటేష్, నాయకులు కీర్తి రాఘవ, కుసనం దొరబాబు, వంగలపూడి వాసు, గారా శ్రీనివాసరావు, కార్యదర్శి మధుశేఖర్ పాల్గొన్నారు.

పేదల ఇంటి ముంగిటకే వైద్యసేవలు

కోటనందూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదల ఇంటి ముంగిటకే వైద్య సేవలు అందుతున్నాయని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. మండలంలోని అల్లిపూడిలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సర్పంచ్ తలిపే చినతల్లితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ అన్ని వర్గాలకు మంచి చేసే సీఎం జగన్, మంత్రి దాడిశెట్టి రాజాను వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్, మండలాధ్యక్షుడు సుర్ల రాజు, ఉప సర్పంచ్ చింతకాయల చిట్టిబాబు, కో ఆప్షన్ సభ్యుడు జిగటాల కోటసత్తిబాబు పాల్గొన్నారు.

శంఖవరం: మండలంలోని కొంతంగిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సర్పంచ్ దూడల రామస్వామి ప్రారంభించారు. డాక్టర్లు సుమారు 500 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నడిగట్ల నానాజీ, ఉప సర్పంచ్ మరిపిరెడ్డి మంగారావు, వైఎస్సార్ సీపీ నాయకులు రాయపాటి చంటి, దూడల శివకుమార్, సర్నం సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎ.మల్లవరంలో..

రౌతులపూడి: మండలంలోని ఎ.మల్లవరంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. తొలుత వైద్య శిబిరాన్ని సర్పంచులు చిందాడ పెదరాజు, వి.సత్యనారాయణ, ఎంపీటీసీ బొడ్డు రాజా ప్రారంభించారు. డాక్టర్లు 315 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో ఎనిమిది మందిని మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. కంటి వెలుగులో భాగంగా 90 మందికి కంటి పరీక్షలు చేసి 80 మందికి ఉచితంగా కళ్ల జోళ్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, పార్టీ నాయకులు కాకి నాని, నాకిరెడ్డి అప్పలనాయుడు, పెద్దాపురం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఎంతో మేలు

తొండంగి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు ఎంతో మేలు జరుగుతోందని తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళి అన్నారు. మండలంలోని సీతారాంపురంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు ఆరోగ్య సురక్ష కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఏవీ నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవి కుమార్, వైద్యురాలు పి.భారతి, ఎంపీటీసీ పెండ్యాల రామకృష్ణ, సర్పంచ్ పెండ్యాల సీతామహాలక్ష్మి, పార్టీ నాయకులు పగడాల నానాజీ తదితరులు పాల్గొన్నారు.


ఎస్.అన్నవరంలో రోగులకు ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు


అల్లిపూడిలో రోగులకు ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీనివాసు తదితరులు


ఎ.మల్లవరంలో రోగికి కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్లు


సీతారాంపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించిన వైఎస్సార్ సీపీ నాయకులు